

# శాపగ్రస్తులైన గురుశిష్యులు

నిమి చక్రవర్తికి నిరంతరం యజ్ఞాలను నిర్వహించాలనే అపేక్ష ఎక్కువ. కుల గురువులైన వశిష్ఠుని ద్వారా ఆయన సశాస్త్రీయంగా పలు యజ్ఞాలు నిర్వహించాడు. యజ్ఞాలను అనుష్ఠింపచేసి అలసిపోయాడు గురువు. శిష్యునికి శ్రద్ధ ఏమాత్రం తగ్గలేదు. యజ్ఞ సంభారాలన్నీ సమకూర్చుకుని విశ్రాంతి తీసుకుంటున్న గురువు గారి వద్దకు వెళ్ళి యజ్ఞం నిర్వహణ బాధ్యత స్వీకరించవలసినదిగా కోరాడు నిమి చక్రవర్తి. చేసి, చేసి అలసి ఉన్నాను కొంతకాలం ఆగవయ్యా... అన్నాడు వశిష్ఠుడు. ఆగితే ఎట్లా? అంటాడు నిమి చక్రవర్తి యముడు నాకు స్నేహితుడు కాదు. అతడు ఎప్పుడు పట్టుకు వెళతాడో తెలియదు.



ఈ జీవితం స్థిరంకాదు ధర్మమొక్కటే శాశ్వతం. దానికోసం త్వరపడకపోవడం దోషం. మరణానంతరం కూడా సుఖాన్నిచ్చేది ధర్మమొక్కటే కదా. రేపటి పనిని ఈ రోజే ఆచరించేటట్లు త్వరపడాలి. అపరాహ్ణానికి చేయాల్సిన పనిని పూర్వాహ్ణానికే చేయాలి. మనిషి పనిచేసినా చేయకపోయినా మృత్యువు ఆగదు. అది తోడేలు గొఱ్ఱెపిల్లను కబళించినట్లు కబళిస్తుంది.

దానికి ఇది ప్రియము అప్రియము అనే తేడా ఉండదు. ఏ క్షణాన బ్రతుకంటే అదే బ్రతుకు. మరోక్షణం మనదౌతుందో కాదో తెలియదు కనుక దేవతా ఋణాన్ని తీర్చుకోవడానికి సంభారాలన్నీ సమకూర్చుకొని త్వరపడుతున్నాను.

మీరు యజ్ఞం నిర్వహించలేనంటే చెప్పండి మరొక యాజకుడిని వేడుకుంటాను అన్నాడు వినమ్రంగా నిమి చక్రవర్తి.

వశిష్ఠుడికి నిమి చక్రవర్తి మరొక యాజకుడిని చూసుకుంటాననేసరికి పట్టరాని కోపం వచ్చింది అంతమాటంటావా...? నన్ను కాదని మరొకడిని చూసుకుంటా నంటావా? అంత మాట నన్ను నువ్వు అన్నందుకు ఇప్పుడే విదేహుండవుకా... అని శపించాడు. తెల్లబోయాడు నిమి చక్రవర్తి. పుణ్యకార్యం చేసి పెట్టవయ్యా అంటే కాదు పొమ్మన్నాడు. నీవు చేయవు, ఇతరులతో చేయించుకుంటానయ్యా అంటే నశించిపొమ్మని శాపనార్థాలు పెడతావు. నీవేం గురువువయ్యా నీవు నాలాగే విదేహుడవుకా అని తిరుగు శాపం పెట్టాడు నిమి.



డా॥ ప్రతాపదక్షిణా మూర్తి దీక్షితులు

ఇరువురి మాటాలూ ఫలించాయ్. దేహాలు విడిచి జీవులిద్దరూ బ్రహ్మను చేరారు. మాట తొందరకు ఫలితం ఇది. బ్రహ్మ నిమికి ప్రాణుల కనురెప్పలను స్థానంగా చేసాడు. దానివల్ల ప్రాణులకు 'నిమిషము' (ఱెప్పపాటు) ఏర్పడింది. (నిమి+శ=నిమి దీనియందు శయనించి విశ్రాంతి పొందాడు). వశిష్ఠునికి మిత్రావరుణులనే జంట దేవతలకు కుమారునిగా... పుట్టమని బ్రహ్మ ఆదేశించాడు. అగస్త్యునితోపాటు వశిష్ఠుడు పూర్వజన్మ స్మృతితో, 'కుంభసంభవు',నిగా మిత్రావరుణుల తేజస్సును స్వీకరించి దేహధారి అయ్యాడు.

బ్రహ్మ మానస పుత్రునిగా అవతరించిన వశిష్ఠుడు నిమి చక్రవర్తి విషయంలో నోరు సంభాళించుకోలేక ఇచ్చిన శాపఫలంగా కుంభ సంభవత్వం లభించింది. తన తొందరపాటు తనం ఎదుటి వారితోపాటు తనకూ చేటు తెచ్చి పెడుతుందనే విషయం స్వయంగా అనుభవంలోకి రావడంతో వశిష్ఠుడు వాక్సంయమనంతో తపస్సాధన చేస్తూ విశ్వామిత్రుడిని సహించే పరిస్థితి ఏర్పడింది. మన మాటను ఎదుటివాడు మన్నించే వరకే మన శాంతం, మన మర్యాద, మన సహనం. ఎదుటి వాడు ఏమాత్రం మనల్ని తిరస్కరించినా మన అహంకారం దెబ్బతింటుంది, క్రోధం నెత్తికెక్కుతుంది. శక్తివంతుడి విషయంలో ఇది మరీ ఎక్కువ. ఆ సమయంలో ప్రతీకారేచ్ఛతో బుసలుకొట్టే వైఖరి క్షాంతికి సమాధికట్టి హింసకు పట్టాభిషేకం చేస్తుంది. వశిష్ఠ – నిమి వృత్తాంతం ఈ సత్యాన్నే చాటుకున్నది.

ఓం శ్రీయై నమః